క్లుప్తంగా

గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 8 కేంద్రాలకు 1,940 మంది అభ్యర్థుల కేటాయింపు..



జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో బెంచీలపై నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో ఆదివారం గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నరసన్నపేటలో 8 కేంద్రాల్లో 1,940 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. డీఆర్ఎస్ కళాశాలలో 240 మంది, పద్మావతి డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో 400 మంది, జ్ఞానజ్యోతి డిగ్రీ, జూనియర్ కళాశాలల కేంద్రాల్లో 600 మంది, ఎల్వీఆర్ కళాశాలలో 300 మంది, శర్వాణి స్కూల్లో 200 మంది, నారాయణ స్కూల్లో 200 మంది అభ్యర్థులు పరీక్షలు రాయన్నారని తహసీల్దార్ పి.కనకారావు శనివారం తెలిపారు. అభ్యర్థులు 9.30 కల్లా కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలి



ఆధ్యాత్మిక సత్సంగంలో పాల్గొన్న వక్తలు

సారవకోట: గ్రామాల్లో ఆధ్యాత్మిక సత్సంగాలు నిర్వహించాలని ఆధ్యాత్మిక వక్త గొలివి మోహన్‌రావు సూచించారు. మాఘ పౌర్ణమి పురస్కరించుకుని కిన్నెరవాడ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు కొరపాక సిద్ధయ్య స్వామి ఆధ్వర్యంలో శనివారం సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు గ్రామాల్లో ఆధ్యాత్మిక సత్సంగాలు చేపట్టాలని, దీంతో ప్రజల్లో భక్తి భావం పెరుగుతుందన్నారు. భీష్మాచార్యుని జీవిత చరిత్ర, భగవద్గీతలో పలు ముఖ్య ఘట్టాలను వివరించారు. రామశేషు, బోయిన వెంకటరమణ, గురయ్య, రామదాసు, నిక్కు హరిసత్యం ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు.

తల్లిదండ్రుల రుణం తీర్చలేనిది



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: తల్లిదండ్రుల రుణాన్ని వెలకట్టలేమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో ప్రభుత్వ ఆస్పత్రి స్థల దాత, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తల్లిదండ్రులు వెంకట అప్పలనాయుడు, విశాలాక్షి విగ్రహాలను శనివారం ఆస్పత్రి ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిల్లి రామ్మోహన్‌రావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



దొంకలపర్త ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

బూర్జ: మండలంలోని దొంకలపర్త, అల్లెన గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎస్.వి.అంబేడ్కర్ శనివారం పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను పరిశీలించి తగిన సూచనలు అందజేశారు. సదుపాయాలు లేని పాఠశాలల్లో త్వరగా పనులు చేపట్టాలన్నారు. వీఆర్వో దాలయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



పూజలు అందుకుంటున్న పంచముఖ ఆంజనేయ స్వామి

సారవకోట: మండలంలోని అద్దపనస గ్రామంలో నిర్మించిన పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ దేవస్థాన పండితులు అక్కాజోష్యుల రమేష్ శర్మ యంత్ర, గోపుర, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్పదర్శనం, సాధారణ దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సుమారు రూ.22 లక్షలతో పట్టా ఉమామహేశ్వరరావు కుటుంబంతోపాటు గ్రామస్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం చేపట్టారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- నరసన్నపేటలో రూ.2.42 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తూ.. మరోవైపు అభివృద్ధి పనులు కూడా అంతే పారదర్శకంగా నిర్వహించామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మేజరు పంచాయతీ నరసన్నపేటలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే దీనికి ఉదాహరణ అని అన్నారు. నరసన్నపేటలో రూ.2.42 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశవానిపేట, ప్రభుత్వ జూనియర్ కళాశాలల వద్ద ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులకు తగిన ప్రాధాన్యత ఇచ్చి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఒక్క నరసన్నపేట టౌన్‌లోనే గడిచిన నాలుగేళ్లలో రూ.20 కోట్లకు పైగా నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పట్టణానికి చెందిన 900 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి వారికి ఇళ్లు కట్టుకునేందుకు ఒక్కొక్కరికి రూ.1.85 లక్షలు మంజూరు చేశామన్నారు. అలాగే పట్టణంలో రూ.5 కోట్లు వెచ్చించి ఇంటింటికీ తాగునీరు అందించే పనులు చురుగ్గా జరుగుతున్నట్లు వివరించారు. టీడీపీ హయాంలో రూ.15 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు అస్తవ్యస్తం చేపట్టారని, వీటికి పంచాయతీ నిధులు, మండల పరిషత్ నిధులు వెచ్చించి డ్రైన్లు అన్నీ సరి చేయడం జరిగిందన్నారు. సీసీ రోడ్లు పలు వీధుల్లో వేశామని, మిగిలిన వీధుల్లో కూడా వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ నరసన్నపేట అభివృద్ధిని గత టీడీపీ హయాం, ప్రస్తుతం పోల్చి చూస్తే తెలుస్తుందన్నారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు–నేడు నిధులు రూ.1.25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభించారు. కాంప్లెక్స్ ఎదురుగా రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, శివనగర్ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైను, సీసీ రోడ్డు, లచ్చుమన్నపేటలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, వజ్రంపేటలో రూ.8 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. దేశవానిపేట, పంచాయతీ కార్యాలయ ఆవరణల్లో చెరో రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను, పంచాయతీ కార్యాలయం పైన రూ.25 లక్షలతో నిర్మించిన అదనపు భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పీఆర్ డీఈ సత్యంనాయుడు, ఏఈ మోహన్‌రావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నారాయణస్వామి, పంచాయతీ వార్డు సభ్యులు కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, ఇప్పిలి నీలం, రఘుపాత్రుని శ్రీధర్, బీఎల్ శర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాట్నూరు సాయి ప్రసాద్, గనగళ శ్రీను, రావాడ మోహన్‌రావు, ఇత్రాజు సూరిబాబు, బుద్దల రాజశేఖర్, పెదిరెడ్ల రాము, వండాన లక్ష్మణరావు, పంగ చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, నాయకులు

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- పురుషోత్తపురంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం

సరుబుజ్జిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి అగ్రపీఠం వేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం స్పష్టం చేశారు. పురుషోత్తపురం పంచాయతీలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ స్వయంగా వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్లు అందజేశారు. వలంటీర్లు, సచివాలయం ఉద్యోగుల పనితీరు, పథకాలు పంపిణీపై ఆరా తీశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే తన దృష్టికి తెస్తే మంజూరుకు చర్యలు చేపడతానన్నారు. మరలా సీఎం జగన్ విజయానికి ప్రజలంతా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి రమాదేవి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కావిలాపు చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ కిల్లి రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు, కిల్లి రామ్మోహనరావు, కిల్లి వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: అర్హులందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందించారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కరజాడ పంచాయతీలో శనివారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. ఈ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలతో లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కలిగిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం నవరత్నాల పథకాలను సీఎం జగన్ అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టిన జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ నాయకుల మాయమాటలను నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి శ్రావణ్‌కుమార్, ఓం శ్రీకృష్ణ, జెడ్పీటీసీ గూడ ఎండయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, మండల నాయకులు ఉదయ్‌కుమార్, జయమునిరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం: కొరసవాడలో విగ్రహాల తిరువీథిలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని రావిచెంద్రిలో నిర్మించిన అభయ కోదండరామ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ పూజల్లో గురువారం పాల్గొన్నారు. ఆలయాల నిర్మాణం, గ్రామాల్లో పండగలు వంటివి నిర్వహించటం వల్ల చిన్నారులు, యువతకు అధ్యాత్మిక భావాలను అలవాటు చేసినట్లు అవుతుందన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, రావిచెంద్రి సర్పంచ్ కొల్ల ఈశ్వరమ్మ, ఆలయ ధర్మకర్త నందివాడ రామారావు, పార్టీ నాయకులు లోచర్ల మల్లేశ్వరరావు, కొల్ల రాము, కెలక్ష్మునాయుడు, గ్రామస్తులు మడపాన రామదాసు, కరిమి ముకుందరావు, కర్నం నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

పాతపట్నం: ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కొరసవాడ మార్కెట్‌లో ఉన్న ఉమాసోమేశ్వర ఆలయం (శివాలయం) పునఃప్రతిష్ఠ మహోత్సవాల్లో ఎమ్మెల్యే శనివారం పాల్గొన్నారు. వినాయకుడు, రాముడు, కృష్ణుడు, శివుడు, జాలరీ వేషధారణలు ఆకట్టుకున్నాయి. మండల కోఆప్షన్ సభ్యుడు పుల్లాయ్, సర్పంచ్‌లు జక్కర ఉమ, నల్లి జగదీశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.తాతయ్య, వీవర్స్ జిల్లా అధ్యక్షుడు మంచు చంద్రయ్య, కర్రి లక్ష్మీనారాయణ, రమేష్, మొత్రి లోకేశ్వరరావు, నారాయణస్వామి, కొరసవాడ, కాగువాడ గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

1న వైద్య శిబిరం

నరసన్నపేట: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో మార్చి ఒకటిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కిమ్స్ ఆస్పత్రికి చెందిన వైద్యులు పైల రమేష్, వారణాశి కేధారనాథ్ తనిఖీలు చేస్తారన్నారు. విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీపీ, సుగర్, ఈసీజీ వంటి పరీక్షలు చేస్తారని తెలిపారు.

వైభవంగా చక్రతీర్థ స్నానాలు



చక్రతీర్థ స్నానం అనంతరం ఉత్సవ మూర్తులను తీసుకువస్తున్న అర్చకులు

సారవకోట: మండలంలోని చీడిపూడి కల్యాణ వెంకటేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో భీష్మ ఏకాదశి నుంచి జరుగుతున్న స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులకు ప్రత్యేక, విశేష పూజలు చేపట్టారు. చీడిపూడి, బుడితి, అవలింగి గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక ఎర్రన్నాయుడు కోనేరులో ఆలయ ధర్మకర్తలు గేదెల బాలకృష్ణం నాయుడు, కృష్ణారావు నాయుడు ఆధ్వర్యంలో స్వామివారికి చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సోమలింగేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: చెన్నాపురంలోని సోమలింగేశ్వర స్వామి కల్యాణం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు టేకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కల్యాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి కల్పించాలి

ఎల్.ఎన్.పేట: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఏపీఓ వి.శ్రీదేవి సిబ్బందికి సూచించారు. వంద రోజుల పని కల్పించటం లక్ష్యంగా తీసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులు చేపట్టాలన్నారు. వంద రోజుల పని కల్పించడంలోను, ఉపాధి పనులు చేయించని ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఉపయోగపడే పనులు చేయించేందుకు ప్రాధాన్యం ఇవ్వాల్సన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబం నుంచి పనిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత క్షేత్ర స్థాయి సిబ్బందిపై ఉందన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

ఆమదాలవలస: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగుతూ ఉత్తమ స్థాయికి ఎదగాలని ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి సూచించారు. పట్టణంలోని కొత్తకోటవారి వీధిలో గల బీసీ సంక్షేమ వసతి గృహాన్ని శనివారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందిస్తున్న సబ్బులు, నూనెలు, దుప్పట్లు అందిస్తున్నారా, లేదా అన్నది ఆరా తీశారు. విద్యార్థులకు ఆరోగ్య సంబంధిత అంశాలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహాధికారి వెంకటరావు ఉన్నారు.

గ్రామ సంఘాలే మినీ బ్యాంకులు

ఆమదాలవలస రూరల్: ప్రభుత్వం మహిళా సంఘాలకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పంచ సూత్రాలు పాటిస్తున్న స్వయంశక్తి సంఘాలే మినీ బ్యాంకులుగా వ్యవహరించవచ్చని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం పి.కూర్మారావు అన్నారు. మండలంలోని కలివరం గ్రామంలో స్వయం శక్తి సంఘాల సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు అందిస్తున్న ప్రధానమైన రెండు సేవలను, ఇక అన్ని ఏ-గ్రేడ్ స్వయంశక్తి సంఘాలు కూడా నిర్వహించవచ్చన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ సభ్యుల నుంచి డిపాజిట్ల సేకరణ, అవసరం మేరకు అప్పులు ఇచ్చి తిరిగి తక్కువ వడ్డీతో వసూలు చేసుకోవచ్చని వివరించారు. గతంలో ఈ సౌకర్యం లేక మైక్రో ఫైనాన్స్ సంస్థల ద్వారా అధిక వడ్డీలకు వాడుకోవాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయంతో సొంత నిధులను వినియోగించుకునే అవకాశం వచ్చిందన్నారు. పొదుపు మహిళలు తమ సొంత అవసరాలైన పిల్లల చదువు, కుటుంబ ఆరోగ్యం, చిన్న, చిన్న వ్యాపార పెట్టుబడులు, వ్యవసాయ పెట్టుబడులు, ఇతర కుటుంబ అవసరాలకు తమ స్వయంశక్తి సంఘంలో తీర్మానం చేసుకుని పొదుపు ఖాతా నుంచి అప్పుగా వినియోగించుకోవచ్చన్నారు. వడ్డీ కూడా సంఘ సభ్యుల నిర్ణయం ప్రకారమే ఉంటుందన్నారు. దీని ద్వారా వచ్చిన వడ్డీ అంతా సంఘం సభ్యులకు చెందుతుందని అవగాహన కల్పించారు.

టీడీపీ కార్యకర్తలకే కండువాలు వేసి..

- ఇటువంటి అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మరు
- కట్యాచార్యులపేట సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు

ఆమదాలవలస రూరల్: టీడీపీలో ఉన్న కార్యకర్తలే మళ్లీ ఆ పార్టీలో చేరుతున్నట్లు చేస్తున్న డ్రామాలు గ్రామంలోని ప్రజలంతా గమనిస్తున్నారని కట్యాచార్యులపేట సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎన్ని రామచంద్రరావు అన్నారు. ఈ మేరకు శనివారం ఒక విడుదల చేశారు. కట్యాచార్యులపేట గ్రామ పంచాయతీ నుంచి వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలోకి శనివారం ఐదు కుటుంబాలు వస్తున్నట్లు పసుపు కండువాలు వేసుకుని చేస్తున్న డ్రామాలు వల్ల ఎటువంటి లాభం ఉండదన్నారు. టీడీపీకి చెందిన కార్యకర్తలే అదే పార్టీలోకి మళ్లీ వస్తున్నట్లు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇటువంటి అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మేపరిస్థితి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్‌తోపాటు పేదవారికి పక్కా గృహాల మంజూరు, ప్రతీ ఇంటికి అందించిన సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్షలా నిలుస్తాయన్నారు. ఐదేళ్ల పాలనలో స్పీకర్ తమ్మినేని సీతారాం గ్రామానికి తారోడ్డు వేయించడంతో పాటు ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, ఇతర అభివృద్ధి పథకాలను అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్ కూడా రాదన్నారు.

ముగిసిన పోలాకి జాతర

పోలాకి: మండల కేంద్రం పోలాకిలో గత ఐదురోజులుగా నిర్వహించిన శ్రీకనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవ జాతర శనివారంతో ముగిసింది. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తోపాటు పలువురు నాయకులు అమ్మవారి ఆశీస్సులు పొందారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్న ఎస్ఐ సత్యనారాయణకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పౌరసన్మానం చేశారు.



విద్యుత్ వెలుగులతో పోలాకి జాతర ప్రాంగణం

నేటినుంచి సుసరాం జాతర..

తీరప్రాంత భక్తుల ఇలవేల్పు సుసరాం దుర్గాదేవి అమ్మవారి జాతర ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు సనపల అప్పలసూరి శనివారం తెలిపారు. మూడురోజుల పాటు జరిగే జాతర కార్యక్రమాలు దేవదాయధర్మాదయశాఖ ఆధ్వర్యంలో జరగనున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జలుమూరు: ఇసుక రీచ్‌లలో నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సి.హెచ్.నాగమ్మ అన్నారు. దొంపాక ఇసుక రీచ్ నిర్వహణ బిల్లులు, పలు రికార్డులు శనివారం పరిశీలించారు. ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుక రవాణా అవుతోందని, వాటి మేరకు బిల్లులు సరిపోయాయా, లేదా అన్నది సరి చూశారు. తొలిత తిమడాం, పర్లాం, అంధవరం సచివాలయాలు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు పరిశీలించారు.



దొంపాక ఇసుక రీచ్ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

ఓటు హక్కుపై అవగాహన

పాతపట్నం: ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్ఐ సునీల్‌కుమార్ అన్నారు. పాతపట్నం గ్రామ సచివాలయం-1 సమీపంలోని బస్టాండ్ వద్ద విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఓటు హక్కు వినియోగం, విలువలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. వీఆర్వో పార్థసారధి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ సునీల్‌కుమార్

చట్టాలపై అవగాహన అవసరం



పొందూరు: మాట్లాడుతున్న జడ్జి జోత్స్న



బూర్జ: మాట్లాడుతున్న సివిల్ జడ్జి ఎస్.మణి

బూర్జ: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని ఆమదాలవలస మునసబ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. మండలంలోని వైకుంఠపురంలో గ్రామ సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. అరెస్టులు, న్యాయ సహాయం, సలహాలకు సంబంధించిన విషయాలు ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, మండల వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తినాయుడు, పోలీస్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పొందూరు: విద్యార్థులకు చట్టాలు, న్యాయ పరమైన అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని పొందూరు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంఘం చైర్‌పర్సన్ బి.జ్యోత్స్న అన్నారు. మండల కేంద్రంలోని సిస్టం డిగ్రీ కళాశాలలో శనివారం మండల న్యాయసేవా సంఘం ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. పోక్సో చట్టం, లోక్ అదాలత్, లింగబేధాలు వంటి అంశాలపై సమగ్రంగా మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ ఎం.మోహనరావు, బార్ అసోసియేషన్ సభ్యులు వైవీ బ్రహ్మాజీ, పి.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.